ఆంధ్రజ్యోతి
కామారెడ్డి
జిల్లా వార్తలు





ఎస్పీ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహాన్ని అందుకుంటున్న ఎస్సై అనిల్

శభాష్ అనిల్

- ఫేక్ కరెన్సీ ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ
- అభినందించిన ఎస్పీ రాజేష్‌చంద్ర
- నగదు ప్రోత్సాహం అందజేత

మాచారెడ్డి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫేక్ కరెన్సీ ముఠాను పట్టుకోవడంలో ముఖ్య పాత్ర వహించిన మాచారెడ్డి ఎస్సై అనిల్‌ను జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించి నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. ఫేక్ కరెన్సీ ముఠాను పట్టుకోవడంలో ఎస్ఐ చాకచక్యంగా వ్యవహరించాడని ఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ చేతుల మీదుగా నగదు పురస్కారాన్ని అందుకున్న ఎస్ఐ అనీల్‌కు పోలీసుస్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

టపాకాయల విక్రయ దుకాణాలకు
అనుమతి తప్పనిసరి

సుభాష్‌నగర్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసే టపాకాయల దుకాణాలకు విక్రయదారులు సంబంధిత డివిజనల్‌స్థాయి పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక టపాకాయల దుకాణాలు పెట్టేవారు సంబంధిత డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు నెలకొల్పితే ఎక్స్‌పోజివ్ యాక్ట్ 1884, రూల్స్ 1,933 సవరణ 2008 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. టపాకాయల దుకాణాలు సంబంధిత ఖాళీప్రదేశాల్లో నెలకొల్పాలని తెలిపారు. ఎన్‌వోసీ సర్టిఫికెట్‌ను పొందుపర్చాలని తెలిపారు. జనం రద్దీగా ఉంటే ప్రదేశాల్లో టపాకాయల షాపులు పెట్టొదదని సూచించారు. కళ్యాణ మండపాలు, సమావేశ కేంద్రాల్లో టపాకాయల దుకాణాలు ఉండొద్దని పేర్కొన్నారు. దుకాణాదారులు ఫైర్‌కు సంబంధించిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

శృంగేరి జగద్గురువుల విజయయాత్ర ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షలో వైదిక సిబ్బంది, దేవాదాయశాఖ అధికారి

బాసర, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): విజయ యాత్రలో భాగంగా నవంబరు 17, 18, 19 తేదీల్లో బాసరకు రానున్న దక్షిణామ్నాయ శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామి పర్యటన ఏర్పాట్లను సరస్వతీ అమ్మవారి ఆలయం అధికారులు పరిశీలించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి ఆదివారం బాసర వర్సి సమీక్షించారు. సమావేశంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త శరత్‌పాఠక్, కార్యనిర్వహణాధికారి అంజనా దేవి, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ఆలయ వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మహాస్వామి వారి ఆగమనాన్ని ఒక చారిత్రక ఘట్టంగా భావించి, అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు వైభవంగా నిర్వహించాలని ధార్మిక సలహాదారు గోవిందహరి ఆదేశించారు.

ఏ శాఖలో అయినా ఉన్నతాధికారి పర్యవేక్షణ చేస్తూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజలకు చేరువ అయ్యేలా చూస్తారు. కానీ జిల్లా ఐసీడీఎస్‌లో మాత్రం ఆ శాఖ పరిధిలో కొనసాగుతున్న విభాగాల్లో అసలు కంటే కొసరు సిబ్బందే పెత్తనం ఎక్కువగా సాగుతోందనే గుసగుసలు సొంత శాఖలోని సిబ్బంది నుంచి వినిపిస్తున్నాయి. ఆ శాఖకు ఉన్నతాధికారి ఉన్నా షాడో డీడబ్ల్యుఓ (డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్)లుగా కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఏ ఫైలు కదలాలన్నా సదరు అధికారికి తెలియాల్సిందేనని, తాను ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఏకచక్రాధిపత్యం సాగిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గాడితప్పిన ఐసీడీఎస్

- అసలు కంటే కొసరు సిబ్బందిదే పెత్తనం
- షాడో డీడబ్ల్యూఓలుగా వ్యవహరిస్తున్న కొందరు ఉద్యోగులు
- అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఓ అధికారి
- శాఖలోని అన్ని విభాగాల్లో సొంత సామాజ్ర్యాన్ని ఏర్పాటు చేసుకున్న వైనం
- ఏ ఫైల్ కదలాలన్నా ఆ అధికారికి తెలియాల్సిందే..
- ఇప్పటికే సదరు ఉద్యోగి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- అయినా మారని తీరు.. అధికారుల వైఖరిపై విమర్శలు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖలో ఓ వివాదం చెలరేగి అది సద్దుమణగగానే మరో వివాదం చోటుచేసుకుంటుంది. ఏదో ఒక వివాదాలతో ఉంటున్నా జిల్లా అధికారులు సరైన దృష్టిసారించకపోవడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోకపోవడంతో సిబ్బంది మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో సఖీ కేంద్రంలోని బిల్లుల్లో జరిగిన అవకతవకలపై అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించడంతో తమ గుట్టు బయటపడుతోందని అవకతవకలకు పాల్పడే సిబ్బంది ఒక్కొక్కరుగా బదిలీల పేరుతో విచారణ జరగకముందే జారుకున్నారు. కొద్దిరోజులు సద్దుమణిగినా మళ్లీ ఇప్పుడు వివాదాలతో రచ్చకెక్కుతోంది. కార్యాలయంలో పని చేసే ఓ అధికారి అంతా తానై చక్రం తిప్పుతున్నాడని ఆయన వ్యవహారంతో శాఖలోని ఇతర విభాగాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రజాసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఒకరు షాడో డీడబ్ల్యుఓగా వ్యవహరిస్తూ తనకంటూ సొంత సామాజ్ర్యాన్ని ఏర్పాటుచేసుకుని ఓ వ్యక్తిని దూతగా ఏర్పాటు చేసుకుని ఏకంగా డీడబ్ల్యుఓ కదలికలపై వెంట ఉంచి ఎక్కడ ఏం జరుగుతుందో తనకు తెలియజేయాలని చెప్పి పురమాయిస్తున్నాడనే ఆరోపణలు సొంతశాఖలోని సిబ్బంది సైతం చర్చించుకోవడం గమనార్హం. అందుకుగాను సదరు ఉద్యోగి అర్హత లేకున్నా ఆ శాఖలోనే ఓ విభాగానికి సంబంధించిన కీలకపోస్టును అప్పగించాడని విమర్శలు ఉన్నాయి. స్వామి కార్యానికి డీడబ్ల్యుఓ వెంట షాడోగా ఉండే సదరు ఉద్యోగి ఎప్పటికప్పుడు విషయాలు తనకు ఉపాధి చూపిన గురువుకు చేరవేస్తున్నాడు. ఎక్కడైనా లోపాలు గుర్తించినట్లు తెలిస్తే చాలు నేరుగా ఆ అధికారికి తెలియజేయడంతో రంగంలోకి దిగి ఐసీడీఎస్‌లోని ఇతర విభాగాల సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఓ విభాగానికి సంబంధించిన కేంద్రంలోకి నిబంధనల మేరకు వెళ్లాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా సమయంకాని సమయంలో ఎంట్రీలు ఇస్తూ తన వ్యాపకాలకు ఉపయోగించుకోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సదరు అధికారిని మందలించి విచారణకు సైతం ఆదేశించారు. అయితే సదరువిచారణ అధికారులను సైతం సదరు అధికారి మ్యానేజ్ చేసేపనిలో ప్రస్తుతం ఉన్నాడంటే ఏ రకంగా శాఖలో తన ప్రభాల్యం చూపుతున్నాడో అర్థం చేసుకోవచ్చు.

నిబంధనలకు విరుద్ధంగా...

ఐసీడీఎస్ శాఖలో మహిళా సంక్షేమానికి సంబంధించి దాదాపు 5నుంచి 6 విభాగాలు ఉంటాయి. ఇందులోని కొన్ని విభాగాలకు వెళ్లాలంటే పలు నిబంధనలు ఉంటాయి. ఈ విభాగంలో ఏదైనా అవసరమైతే సదరుశాఖ ఉన్నతాధికారి పర్మిషన్ తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అందుకుగాను ఆ విభాగాలకు ఏ సమయంలో అక్కడికి వెళ్లారు.. ఏ పని నిమిత్తం వెళ్లారు.. ఎందుకు వెళ్లారు.. అనేది తెలియజేస్తూ ఓ బుక్‌లో వివరాలు రాయాలి. కానీ (మిగతా 8వ పేజీలో)



మాట్లాడుతున్న వివేక్ వెంకట స్వామి

రోస్టర్ పాయింట్లతో
మాలలకు నష్టం

- రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి
- మంత్రి లక్ష్మణ్‌తో నాకు ఎలాంటి విభేదాలూ లేవు
- మాలల ఐక్య సదస్సులో మంత్రి వివేక్ వెంకటస్వామి

సుభాష్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ పాయింట్లతో మాల ఉద్యోగులు, యూనివర్సిటీలో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర కార్మికశాఖమంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన మాల ఐక్య సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్‌ను 15శాతం నుంచి 18శాతానికి పెంచాలని అన్నారు. రిజర్వేషన్ పెంచేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ పెంపు కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ అయిన కర్నాటకలో రిజర్వేషన్‌లను 15 నుంచి 18 శాతం పెంచారని అన్నారు. రోస్టర్‌తో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, మాలలకు పదోన్నతిలో కూడా అన్యాయం జరుగుతోందని అన్నారు. ఇటీవల జరిగిన ఇంజనీర్ నీట్ ప్రవేశాల్లో విద్యార్థులు నష్టపోయారని అన్నారు. మంత్రి వడ్లూరి లక్ష్మణ్ అనవసరంగా విమర్శలు చేస్తున్నారని తెలిపారు. వివేక్‌కు మంచి పేరు వస్తుందని అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారని అన్నారు. సమావేశాల్లో కావాలని వెళ్లిపోతున్నారని, ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వడ్లూరి లక్ష్మణ్‌ను యువజన నాయకుడిగా ప్రోత్సహించింది కాకా వెంకటస్వామి అన్న విషయం ఆయన మరిచారన్నారు. కాకా జయంతి వేడుకల్లో ఆహ్వాన పత్రికలో తన పేరు పెట్టలేదని విమర్శలు చేస్తున్నాడని, మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు తండ్రి దుద్దిళ్ల శ్రీపద్‌రావు జయంతి వేడుకల్లో సైతం పేర్లు పెట్టలేదని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై ఐటీ రైడ్ జరిగిందని ఏ ఒక్కటి కూడా ఐటీ వాళ్లకు దొరకలేదని, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వానికి రూ.10వేల కోట్ల టాక్స్ కట్టానని చెప్పారు. అంతకుముందు మంత్రి వివేక్ చేతుల మీదుగా గ్రూప్స్‌లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హం దాన్, మాలజాతీయ సంఘం అధ్యక్షుడు చిన్నయ్య, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మాల సంఘం నాయకులు

పాఠశాలల్లో ప్రత్యేక కమిటీలు

- నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ప్రోత్సాహం
- ఇప్పటికే సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారుల ఉత్తర్వుల జారీ
- ప్రతీ పాఠశాలలో నాలుగు కమిటీలు



కామారెడ్డి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో ప్రభుత్వ, లోకల్ బాడి, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లు, అర్బన్ రెసిడెన్సి స్కూల్‌లు ఉంటాయి. అయితే ఇప్పటికే అందుకు అనుగుణంగా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారులు ఉత్తర్వులు సైతం జారీ చేశారు. కలిసి పనిచేయడం ద్వారా పిల్లల్లో జట్టుభావన, బాధ్యత, నిర్ణయసామర్థ్యం, సమయపాలన, సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందుతాయని విద్యాశాఖ భావిస్తోంది. జిల్లాలో మొత్తం 191 ప్రభుత్వ ఉన్నత, 123 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 60వేలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ప్రతీ పాఠశాలలో నాలుగు కమిటీలు

ప్రతీ పాఠశాలలో విద్యార్థులతో నాలుగు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. మహనీయుల పేర్లతో ఏర్పాటుచేసే బృందాలకు ఎరుపు, ఆకుపచ్చ, నీలం,పసుపురంగులు కేటాయిస్తారు. ఎరుపు రంగుకమిటికి అబ్దుల్ కలం, ఆకుపచ్చరంగు కమిటికి శకుంతల దేవి, నీలం రంగు కమిటికి సీవీరామన్, పసుపురంగు కమిటికి రవీంద్రనాథ్‌టాగూర్ పేర్లతో పిలవనున్నారు. కెప్టెన్,వైస్‌కెప్టెన్‌లుగా సైతరగతుల విద్యార్థులు వ్యవహరిస్తారు. బృందంలో మొత్తం 8 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఇద్దరు బాలికలు తప్పనిసరిగా ఉండాలి. ప్రధానోపాధ్యాయుడి నిధి నుంచి బృందాలకు ఒక్కోరంగు యూనిఫాం కేటాయించాలి. ఒక ఉపాధ్యాయుడు సలహాదారుడిగా వ్యవహరిస్తారు. వీరు ప్రతినెల మూడో శనివారం సమావేశం నిర్వహించి పాఠశాల సమస్యలపై చర్చిస్తారు.

పర్యవేక్షణలో కీలకం

విద్యార్థుల కమిటీలు పాఠశాలలో వివిధ పనులను పర్యవేక్షించడంలో కీలకంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రతీరోజు విద్యార్థుల హజరు, మధ్యాహ్నభోజనం నాణ్యత పరిశీలన, ఉదయం ప్రార్థన చేయించడం. తోటిపిల్లలకు పరిసరాలు,వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి. క్రమశిక్షణతో జట్టుగా పనిచేసేలా ప్రోత్సహించాలి. ఇప్పటికే పచ్చదనం, పరిశుభ్రత ఏకో క్లబ్‌లు పనిచేస్తున్నాయి. భద్రత,బాలిక సాధికారత, ఆరోగ్యం, ప్రహరీ, లైబ్రరీ, సాహిత్య, సాంస్కృతిక, కళలు,క్రీడలు వంటి ప్రత్యేక క్లబ్ ఏర్పాటుచేశారు. విద్యార్థుల కమిటీలు ఆయా క్లబ్‌లను సమన్వయం చేసుకుంటూ పనిచేయాల్సి ఉంటుంది.

కమిటీల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించాం

• రాజు, డీఈవో, కామారెడ్డి

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంచడంతో పాటు పాఠశాలలో ఇప్పటికే ఏర్పాటుచేసిన క్లబ్‌లు, ఇతర వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కమిటీలను ఏర్పాటుచేసేందుకు కసరత్తు ప్రారంభించాం. దసరా సెలవుల కంటే ముందు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సెలవుల అనంతరం అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కమిటీ ఏర్పాటుపై సూచనలు చేశాం. ప్రతీ పాఠశాలలో 4 కమిటీలు ఉండగా, అందులో 8మంది సభ్యులు ఉంటారు. ఒక ఉపాధ్యాయుడు ఈ కమిటీలను కోఆర్డినేషన్ చేస్తూ సలహాలు, సూచనలు చేస్తాడు. త్వరలోనే పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలలో కమిటీలు అందుబాటులోకి రానున్నాయి.

వైద్య ఆరోగ్య ఉద్యోగుల
సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూపాల్

కామారెడ్డి టౌన్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రగౌరవ అధ్యక్షుడు భూపాల్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైద్యశాఖలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఏఎన్ఎంల పని భారం తగ్గించాలని, 1,930 ఏఎన్ఎం పోస్టులు, 2300 నర్సింగ్ ఆఫీసర్స్, 1చ284 ఎల్‌టీ, 735 ఫార్మసిస్ట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం చర్యలు



మాట్లాడుతున్నరాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూపాల్

చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని (మిగతా 8వ పేజీలో)

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌లో
క్రీడాకారులకు పతకాలు

సుభాష్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు పతకాలను సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగమణి ఆదివారం తెలిపారు. అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలు హన్మకొండలో ఆదివారం జరిగాయని చెప్పారు. ఈ పోటీల్లో నిహారిక, శ్రీవల్లి బంగారు పతకాలు సాధించగా సుమానియా వెండి పతకం, శృతి రజత పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలో పతకాలు సాధించిన క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీలకు జిల్లా కోచ్‌గా యాకుబ్ అలీ అన్సారి వ్యవహరించారు.




పతకాలు సాధించిన క్రీడాకారులు

బిల్లులు రాక.. వడ్డీలు కట్టలేక

- నిధుల కోసం మాజీ సర్పంచ్‌ల నిరీక్షణ
- అభివృద్ధి చేస్తే అప్పులే మిగిలాయని ఆవేదన
- తెచ్చిన డబ్బులకు పెరిగిపోతున్న వడ్డీ
- పదవీకాలం ముగిసి ఏడాదైనా రాని నిధులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధి కోసం చేసిన ఖర్చుల బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఎదురుచూస్తున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో మాజీ సర్పంచ్‌లు నిధులు మంజూరు కాకపోయినా అప్పులు తెచ్చి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పనులు పూర్తిచేశారు. 2022, 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఒత్తిడి తీసుకురావడంతో గత్యంతరం లేక నాటి సర్పంచ్‌లు బయటనుంచి పెద్దమొత్తంలో అప్పులు తెచ్చి పనులు చేపట్టారు. ఒక్కో గ్రామపంచాయతీకి మాజీసర్పంచ్‌లు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.20లక్షల వరకు పనులు పూర్తిచేసి బిల్లులు రాక ఎదురుచూస్తున్నారు. రెండేళ్లు గడిచినా గత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయలేదు. దీంతో నాటి సర్పంచ్‌లు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో అవి ఎలా తీర్చాలని మనోవేదనకు గురవుతున్నారు. జిల్లాలో 22 మండలాలు, 527 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేస్తామని చెప్పి, నిధులు మంజూరు చేయలేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పెండింగ్‌లోనే ఉన్నాయి. నాటి (మిగతా 8వ పేజీలో)



నిధులు విడుదల చేయాలి

• రఘువీర్‌గౌడ్, మాజీ సర్పంచ్, కళ్యాణి గ్రామం

గ్రామ అభివృద్ధి కోసం అప్పు తెచ్చి శానిటేషన్, వీధిదీపాలు, మోటార్లకు మరమ్మతులు ట్రాక్టర్, డిజిల్, డంపిం గ్ యార్డు, సీసీ పనులు చేశాం. సు మారు లక్షల రూపాయలు ఖర్చు చేశాను. తెచ్చిన డబ్బులకు వడ్డీల మీ ద వడ్డీలు పెరిగిపోతున్నాయి. కట్టలేక పోతున్నాం. ప్రభుత్వం స్పందించి మాజీ సర్పంచ్‌ల బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నాం.

ప్రభుత్వం నుంచి బిల్లులు రాగానే అందజేస్తాం

• మురళీ, జిల్లా పంచాయతీ అధికారి, కామారెడ్డి

గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాం. గత రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే మాజీ సర్పంచ్‌ల పెండింగ్ అభివృద్ధి పనుల బిల్లులను వారికి అందజేస్తాం.

క్రైం సమాచారం

షార్జాలో ఐలాపూర్ వాసి ఆత్మహత్య


సంగమేశ్వర్(ఫైల్)

లింగంపేట, అక్టోబర్12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐలాపూర్‌కు చెందిన మన్నె సంగమేశ్వర్(40) షార్జాలో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ 28 నుంచి దుబాయ్‌లోని అల్‌తురాయి కంపెనీలో షార్జాలో లేబర్‌గా పనిచేస్తున్నాడని వారు చెప్పారు. పని చేస్తున్న కంపెనీలోనే శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం షార్జా నుంచి ఫోన్ వచ్చినట్లు వారు వివరించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి స్థానిక ఎ మ్మెల్యే మదన్‌మోహన్ సహాయం చేయాలని వారు కోరుతున్నారు. మృతుడికి భార్య సరిత ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నీటమునిగి ఒకరి మృతి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో నీటి మునిగి ఒకరు మృతిచెందిన సంఘటన మల్కాపూర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం .. మల్కాపూర్‌కు చెందిన కొండ సంగయ్య(52) వ్యవసాయం చేస్తూ జీవిస్తాడు. పనులు లేని సమయంలో చేపలవేటకు వెళ్లేవాడు. ఇదే క్రమంలో చేపట వేటకు వేటకు వెళ్లి తిరిగిరాలేదు. మధ్యాహ్నం స్థానికులకు నీటిలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డివైడర్‌ను ఢీకొని యువకుడు..

సుభాష్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుబ్బ ప్రాంతంలో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి బైక్ డివైడర్‌ను ఢీకొని మిర్చి కంపౌండ్‌కు చెందిన యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. దుబ్బ రోడ్‌లోని శివాజీచౌక్ నుంచి కృష్ణ మందిర్ వరకు బైక్‌పై ప్రశాంత్, సందీప్ అనే వ్యక్తులు వెళ్తుండగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని తప్పించబోయి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొన్నారు. తీవ్ర గాయాలైన ప్రశాంత్, సందీప్‌లను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రశాంత్(24) మృతిచెందగా.. సందీప్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని మూడవ టౌన్ ఎస్సై హరిబాబు పరిశీలించారు. ప్రశాంత్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

12.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవీపేట, అక్టోబరు12, (ఆంధ్రజ్యోతి): నవీపేట మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. నిజామాబాద్ నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు వ్యాన్‌లో 12 క్వింటాళ్ల 50కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సంబంధిత వాహనాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, వాహన డ్రైవర్ అసద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. సంబంధిత రేషన్ బియ్యం విషయంపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించినట్లు వివరించారు.

వసతులు కరువు.. సమస్యల దరువు

▸▸ సులేమాన్‌నగర్‌లో పడకేసిన పారిశుధ్యం ▸▸ పట్టించుకోని పాలకులు, అధికారులు ▸▸ అవస్థలతో ప్రజల సావాసం

రుద్రూరు,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సులేమాన్‌నగర్‌లో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్యంపై అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ సరిగ్గా లేక ఎక్కడపడితే అక్కడే మురుగు నీరు నిలుస్తుంది. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో జనాలు పడరాని పాట్లు పడుతున్నారు. మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి.

అధ్వానంగా పరిసరాలు

సులేమాన్‌నగర్ గ్రామంలో పరిసరాలు అధ్వానంగా మారాయి. గ్రామ పంచాయతీ అధికారులు ఇంటింటి చెత్త సేకరణను చేపట్టకపోవడంతో కాలనీల్లోని పలు ప్రాంతాలు పెంట కుప్పలను తలపిస్తున్నాయి. రోడ్ల వెంట చెత్తచెదారం పేరుకుపోయింది. డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధభరితంగా మారాయి. దోమల నివారణకు సైతం అధికారులు చర్యలు చేపట్టం లేదు. గ్రామంలో రాత్రి అయితే చాలు దోమలతో ప్రజల సవాసం తప్పడం లేదు దోమకాటుతో ఎంతోమంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వరాల బారిన పడుతున్నారు. నెలలో ఒక రోజు సైతం డ్రైనేజీలను శుభ్రపర్చడం లేదు.


సులేమాన్ నగర్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

కనీస వసతులు కరువు

సులేమాన్‌నగర్‌లో కనీస వసతులు కరువయ్యాయి. సరైన డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్లపైనే మురికి నీరు ప్రవహిస్తుంది. ఈ రోడ్లపై నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాలు పడితే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. గ్రామంలో సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

తీవ్ర అవస్థలు పడుతున్నాం



సులేమాన్‌నగర్ లోని మదీనా కాలనీలో మురికా కాల్వలు, సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. మా సమస్యలు తీర్చాలి. **- షేక్ కరీం, సులేమాన్ నగర్**


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మూర్తి

బీసీలను అణగదొక్కేందుకు కుట్రలు

మోర్తాడ్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అన్ని రంగాల్లో బీసీలను అణగదొక్కేందుకు కుట్రలు జరుగుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి ఆరోపించారు. ఆదివారం మోర్తాడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 5శాతంలేని అగ్రవర్ణాలకు 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు బీసీలు వ్యతిరేకించలేదని, ఓసీలో కూడా పేదలున్నారని బీసీ సంఘాలు ఏమి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 42శాతం బీసీ రిజర్వేషన్ ఇస్తారని శతవిధాలా ప్రయత్నం చేసి, అగ్రకులాలు ఓర్వలేక కడుపుమంటతో రెడ్డి జాగృతికి చెందిన మాదవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారని, 2 రోజులు వాదనలు విన్న హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. సమావేశంలో సంఘ సభ్యుడు గంగాధర్ పాల్గొన్నారు.


మెండోరాలో మాట్లాడుతున్న రైతులు

దళారుల చేతిలో మోసపోతున్నాం

మెండోర, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మొక్కజొన్న, సోయా పంటలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో రైతులు సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర రూ.2400 ప్రకటించిందని, దళారులు 1900 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని, సోయా పంట ప్రభుత్వం రూ.5300 రూపాయలు ప్రకటించిందని దళారులు రూ.4000కు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న ,సోయాలను తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంట కొనాలని కోరారు. సమావేశంలో రైతులు ముస్కు రాజేశ్వర్, నోముల బావారెడ్డి, మచ్చర్ల రాజు, మిట్టపల్లి సాయిరెడ్డి, కొడర్మూర్ నన్ని, దొన్కంటి సిద్దాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు రాస్తారోకో

నవీపేట,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల్లో పంట పంట నష్టపోయిన రైతులందరిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 50వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సోమవారం మండలంలోని యంచలో రాస్తారోకో, మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ మహాధర్నాలో గోదావరి పరివాహక గ్రామాలైన కోసీ.., మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, నందిగామ, బినోల, నిజాంపూర్, తుంగిని, నాళేశ్వర్ గ్రామాలకు చెందిన పెద్ద ఎత్తున రైతులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

నవీపేట,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామకు చెందిన చాకలి గంగామణి శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆమె అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం చెట్టుకింది భోజమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సభ్యులు సతీష్‌రావు, కమలాకర్‌రావు రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు.

బాధితులకు పరామర్శ

భీమ్‌గల్‌రూరల్ ,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేంగల్ మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి కుమారుడు వంశీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి సునీల్‌కుమార్ ఆదివారం మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. మనోధైర్యం కల్పించి సంతాపం తెలిపా రు. ఆయన వెంట చెప్పాలా గణేష్, సురేందర్, రాజు ఉన్నారు.

ముప్కాల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వన్నెల్ పలు బాధిత కుటుంబాలను ముత్యాల సునీల్‌కుమార్ తన అనుచరులతో కలిసి ఆదివారం పరామర్శించారు. నాగులపల్లి రాజేశ్వర్ నాన్న పెద్ద దేవన్న మరణించగా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బ రాజేశ్వర్ తల్లి పెరాల్సిస్‌తో బాధపడుతున్న ఆమెను, కలిగోట్ పెద్ద దేవన్న ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి సరికాదు


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

వేల్పూర్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడలో ఆదివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిపట్ల నిరసన తెలిపారు. దళిత సంఘాల సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీజేఐపై దాడి చేసిన రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాని డిమాండ్ చేశారు. గవాయ్‌పై జరిగిన దాడి న్యాయవ్యవస్థను, దళితులపై ప్రజాస్వామిక స్ఫూర్తిపై, భారత రాజ్యాంగంపైన జరిగిన దాడిగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ దాడిని ఖండించాల్సిన అవసరం ఉందని, దాడి చేసిన వ్యక్తిని న్యాయవ్యవస్థ విధుల నుండి తొలగించి దేశ ద్రోహిగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రవి, ప్రతాప్, శంకర్, డేవిడ్, రాజు, ప్రశాంత్, మోహన్, గోపాల్, రాకేష్, నెహ్రూ, ప్రమోద్, శ్రీకాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.


ముప్కాల్‌లో గురువులతో పూర్వ విద్యార్థులు


ఆర్మూర్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఏళ్లకు కలుసుకొని.. జ్ఞాపకాలు నెమరువేసుకొని

ముప్కాల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2003-04 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత అందరు ఒకేచోట కలిసి సందడిగా గడిపారు. ఆనాడు విద్యనేర్పిన గురువులను విద్యార్థులు సత్కరించారు. ఆనాటి ఆనంద క్షణాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం ప్రభుత్వ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థినులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 2005-06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థినులు ఒకచోట చేరి సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేసిన చిలిపి పనులను గుర్తుతెచ్చుకొని ఆడిపాడారు. ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న బాధ్యతలను ఒకరినొకరు చెప్పుకొన్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే ఖబడ్దార్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్,అక్టోబరు12, (ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే షకీల్ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, అలా చేస్తే ఖబడ్దార్ అని బోధన్ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో డీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ బోధన్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పోటీ పడాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు దొరకకపోవడంతో కాంగ్రెస్ పార్టీ వారు కిడ్నాప్‌లు చేస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని హెచ్చరించారు. దమ్ముంటే ఎన్నికలలో నిలబడి పోటీ చేయాలని సవాల్ విసిరారు. వరదలు వచ్చి వెళ్లిపోయిన తర్వాత మాజీ ఎమ్మెల్యే వచ్చారని ఎలక్షన్ అయిన రెండు సంవత్సరాల తర్వాత ఇప్పుడు వచ్చి రైతుల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, పట్టణ అధ్యక్షుడు పాషామొయినోద్దీన్, సీనియర్ నాయకులు శరత్ రెడ్డి, తలారి నవీన్, పార్టీ నాయకులు తదితరులున్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

వేల్పూర్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌కు చెందిన జింబరాతి నవతేజ్ కేయూలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నవతేజ్‌ను ఆదివారం శాలువతో సన్మానించారు. నవతేజ్ ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని వైద్యరంగంలోనే పీజీ పూర్తిచేసి పేదలకు వైద్యసేవలు అందించాలని బీఆర్ఎస్ నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రేగుల్ల రాములు, పిట్ల సత్యం, ప్రతాప్‌రెడ్డి, బోజన్న యాదవ్, మొండి అశోక్, దయాకర్, ప్రభుదాస్, సౌడ కాంతయ్య, నయిమ్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్దాపూర్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

బోధన్, అక్టోబరు12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్దాపూర్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులకు నివాళులు అర్పించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారత్ మాతకీ జై నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ్ ప్రముఖ్ వేణు, ప్రచారక్ భూమయ్యలు మాట్లాడుతూ.. దేశంలో ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామ గ్రామాన శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. హిందూ బంధువులు ఐక్యతతో సంఘటితంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచంలో భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని పేర్కొన్నారు. హిందువులు తమ కట్టుబొట్టు సంప్రదాయాలు తప్పకుండా పాటించాలన్నారు. భారత్ మాతకీ జై అనే నినాదాలతో అమ్దాపూర్ గ్రామం దద్దరిల్లింది. ఒకే గమ్యం వైపు వందలాది మంది భారత్ మాతకీ జై అంటూ అడుగులు వేశారు.ఆర్ఎస్ఎస్ సేవకులు, ప్రముఖులు పాల్గొన్నారు.


ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

వాలీబాల్ జోనల్ స్థాయికి విద్యార్థుల ఎంపిక


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ముప్కాల్,అక్టోబరు12,(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వన్నెల్ బి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు అండర్17 విభాగానికి విద్యార్థులను ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన పోచంపాడ్ పాఠశాల విద్యార్థులైన అక్షిత్, జశ్వంత్, మదన్, గౌతమ్‌తేజ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. కాగా వీరు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలో నిర్వహించే వాలీబాల్ క్రీడల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థు లకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

పెదమ్మ ఆలయంలో అమ్మవారి చీరల వేలం

కమ్మర్‌పల్లి, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కమ్మర్‌పల్లి బస్టాండ్ వద్దగల పెద్దమ్మ ఆలయంలో అమ్మవారిని నెలకొల్పారు. కాగా నవరాత్రుల్లో భక్తులు అమ్మవారికి సమర్పించుకున్న చీరెలను ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వేలం వేశారు. అమ్మవారి చీరెలను దక్కించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం 110 చీరలకు వేలం వేయగా సుమారు రూ.1.10లక్షలతో భక్తులు దక్కించుకున్నారు. వేలంపాటల్లో వచ్చిన నిధులను ఆలయ అభివృద్ధికి వినియోగించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు తెలిపారు. వేలంపాటల్లో ముదిరాజ్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి


వర్నిలో కలిసిన కాంగ్రెస్ నాయకులు

వర్ని, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా పిలుపునిచ్చారు. ఆదివారం పాతవర్ని గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలిసి కట్టుగా పనిచేస్తేనే విజయం వరిస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామ అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి వర్గాల నాయకులు ఎన్నికల్లో ఏకమై పార్టీ కోసం పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు బీర్కూర్ మోగులయ్య, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జక్రాన్‌పల్లి, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిప్యాక్ సొసైటీ పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. మండలంలోని కొలిప్యాక్, కలిగోట్, చింతలూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తూకం వేశారు. ఏ- గ్రేడ్ క్వింటాలు ధాన్యానికి రూ.2389, బి-గ్రేడ్ క్వింటాలు ధాన్యానికి రూ.2369 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని ఆయన కోరారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ మామిడి భాస్కర్‌రెడ్డి, విండో కార్యదర్శి దయాసాగర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న సునీల్ కుమార్

గంగాధర్‌ను స్వదేశానికి రప్పించేందుకు కృషి

ఏర్గట్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం జోర్డాన్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి ఎడారిలో ఇర్కుపోయిన ఏర్గట్ల చెందిన వాల్గోట్ గంగాధర్‌ను స్వదేశానికి రప్పించాలని ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులు బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌ను కలిశారు. సునీల్ కుమార్ బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి విదేశాంగ మంత్రితో మాట్లాడి గంగాధర్ స్వదేశానికి రప్పంచడానికి కృషి చేస్తామనని హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివకుమార్, మండల అధ్యక్షుడు దేవరెడ్డి,లింగారెడ్డి, జీవన్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 12,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని, ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఈఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన అలాయి బలాయి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పద్మశాలీల ఎదుగుదలకు ఒకరినొకరు తోడ్పాటు చేసుకోవాలని, అందరం ఐక్యంగా ఉంటూ ముందుకు సాగుదామని అన్నారు. కొక్కుల రమాకాంత్, మోహన్‌దాస్, విద్యాసాగర్, జీపీ సంతోష్, అన్ని తర్గాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుల మహాధర్నా

కోటగిరి, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): పోతంగల్‌లో సోమవారం రైతుల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఆరు హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. బోనస్ సైతం ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తరలిరావాలని కోరారు.

పెద్దమ్మ తల్లికి బోనమెత్తిన మహిళలు

ఏర్గట్ల, నవీపేట, బోధన్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): ఏర్గట్లలో ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల, బైండ్లోళ్ల విన్యాసాల మధ్య ఊరేగింపు ఘనంగా సాగింది. గ్రామంలోని ముదిరాజ్ సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● నవీపేట మండలం దర్యాపూర్, నవీపేట, మోకన్‌పల్లి తదితర గ్రామాలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక మహాలక్ష్మి, పోచమ్మ, మైసమ్మ, ఇతర గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. పాడి పంటలు చల్లగా ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు.

● బోధన్ మండలం పెగడాపల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ పండుగను నిర్వహించారు. మహిళలు ఇళ్ల నుండి బోనాలు తీసుకువచ్చి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఏర్గట్లలో బోనాలు తీస్తున్న మహిళలు


దర్యాపూర్‌లో బోనాల నిర్వహణ దృశ్యం


బోధన్‌లో బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం



మద్నూర్‌లో మాట్లాడుతున్న జాగృతి జుక్కల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

జాగృతి ప్రణాళిక సిద్ధం

- జుక్కల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్

మద్నూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి నాయకురాలు కవిత ఆదేశాల మేరకు జుక్కల్ నియోజకవర్గం ఇంచార్జి రాజశేఖర్ ఆదివారం మద్నూర్ మండలానికి చేరుకొని విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉందని ఈ నెల 22 నుంచి గ్రామాల వారీగా తెలంగాణ జాగృతి కమిటీలను వేయనునట్లు వెల్లడించారు. జుక్కల్ నియోజకవర్గంలో సైతం కార్యాచరణ ప్రణాళికలుతో సిద్ధంగా ఉన్నామని, త్వరలోనే కవితా నాయకత్వంలో సొంత జిల్లా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆనంతరం ఆయా నియోజకవర్గంలో పర్యటించి రాబోయే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఇటీవల జాగృతిలో చేరిన నాయకులు సురేష్ గౌడ్ బాలరాజ్ పాల్గొన్నారు.

అందని బీమా రైతుల ఆవేదన



ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగి నష్టపోయిన వరి పంట

- వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం
- ప్రధాని ఫసల్ బీమా యోజన పథకం ప్రీమియం నిలిపివేత
- పంటనష్టపోయిన రైతులకు అందని బీమా
- ఆందోళనలో రైతులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సాగు చేసిన పంటలకు నష్టం వాటిలితే రైతులకు పరిహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రారంభించింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ప్రీమియం మిగతా కొంత ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుంది దీంతో పంటలు నష్టపోయిన రైతులు పరిహారం పొందేవారు.

● నిలిచిన పథకం

పీఎమ్ఎఫ్ బీవై కింద పంట సాగు ప్రారంభంలో బీమా చేస్తే నష్టం వాటిల్లినప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేసి బాధితులకు బీమా అంతేగా చేసేవారు. సుమారు ఐదేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం నిలిచిపోయింది.

● జిల్లాలో ఇలా..

జిల్లాలో వర్షాకాలం సీజన్లో ఎక్కువగా వరి పంటను రైతులు సాగు చేశారు. వారితో పాటు మొక్కజొన్న, పత్తి పంటలను సాగుకూడా చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పొలాల్లో కొంతమేర కొట్టుకపోవడంతో పాటు పొలాల్లో ఇసుక మేటలు రాళ్ల పెట్టాయి. దీంతో రైతులు నష్టపోతున్నావని ఆందోళన చెందుతున్నారు. బీమా పథకం అమలులో ఉంటే నష్టపోయిన పంటలకు కొంత మేరకు నష్టపరిహారం అందిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు అయ్యేదా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

● పీఎంఎఫ్‌బీవై పథకాన్ని అమలు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి బీమా యోజన పథకాన్ని నిలిపివేయడంతో భారీ వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లని సమయంలో సాయం అందడం లేదు. ఈ పథకాన్ని తిరిగి అమలు చేసి రైతులకు నష్టం కలిగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- సాయిలు, రైతు

● పథకం అమలులో లేదు

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతుల వివరాలు పంపించాలని ఆదేశాలు ఇచ్చింది. ఇటీవల భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. పీఎంఎఫ్ వీవై పథకం అమలులో లేదు

- నదీముద్దీన్, మండల వ్యవసాయ అధికారి



అస్తమిస్తూ.. అందాలు పంచుతూ

ప్రపంచానికి వెలుతురునిస్తున్న సూరీడు ఉదయించే, అస్తమించే సమయంలో అరుణ కాంతులు వెదజల్లుతూ తన బింబాన్ని ప్రదర్శిస్తుంటాడు. ఈ కోవలోనే ఆదివారం సాయంత్రం సూరీడు అస్తమించే సమయంలో ఈత చెట్టుపై దీపంలా మారి వెలుతురు ఇస్తూ అస్తమించాడు. ● (పెద్ద కొడప్‌గల్, ఆంధ్రజ్యోతి)

ముదిరాజ్ గ్రామ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ గ్రామ ముదిరాజ్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ముదిరాజ్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు కౌలాస్ సంజీవ్ తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా గొర్రె రాములు, ఉపాధ్యక్షులుగా బొమ్మల నాగులు, ప్రధాన కార్యదర్శిగా మాడు జ్ఞానేశ్వర్, కోశాధికారిగా జక్కుల శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవ్ మాట్లాడుతూ ముదిరాజ్ బంధువులు పార్టీలకతీతంగా ఏకతాటిపై ఉండి హక్కుల సాధనకోసం పోరాటం చేయాలన్నారు. అంతేగాక కాకుండ ముదిరాజ్‌లు ఐక్యతగా ఉండి అన్ని రంగాలలో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. దీంతో పాటుగానే మనమెంతో మనకంతా అన్న నినాదంతో రాజ్యాధికార వాటా కోసం పోరాటం చేయలన్నారు. ఇక ముదిరాజ్‌లకు సంబంధించిన ప్రధాన సమస్య అయిన బీసీ డీ నుంచి బీసీఏ గ్రూపులోకి మారే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే పోరాటానికి ప్రతి ముదిరాజ్ బంధువు చేతుకలపాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఏర్పడిని కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మాడు మహేష్, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో మెంటల్ వెల్‌నెస్ కార్యక్రమం



బీర్కూర్ బీసీ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న శ్రీనివాస్

బీర్కూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బా ఫూలే బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెంటల్ వెల్ నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ మధుమలంచ డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు కార్యాచరణ, క్రమశిక్షణ, తల్లిదండ్రులు మన కోసం ఎంత కష్టపడుతున్నారు. మనం తల్లిదండ్రుల కోసం ఏం చేస్తున్నాం, భవిష్యత్తులో మనం ఎలా ఉండాలి, పై చదువులు, ఉద్యోగాల గురించి వివరించారు. అన్వేషణ, ప్రయోగాలు, సమస్యల పరిష్కారం, జ్ఞానం సామర్థ్యాలు, సృజనాత్మక కృత్యాలు, నైపుణ్యాలు ఆటలు, క్రీడలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యార్లగడ్డ శ్రీనివాస్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితాలే రమేష్ , సెక్రటరీ జెట్టి రవీందర్, సభ్యులు గాలయ్య, కొట్టురి సంతోష్, రషిద్, కిషోర్ దాస్, విఠల్, అశోక్, రమేష్, సాయికృష్ణ, సుధాకర్ రెడ్డి, బస్వంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛ భారత్



ఆర్మూర్‌లో శ్రమదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆర్మూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల వసతి గృహం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. డ్రైనేజీని శుభ్రం చేసి నీరు సాఫీగా భయటకు వెళ్లేలా చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సుంకె శ్రీనివాస్, సభ్యులు మధుసుదన్, రాజ్‌కుమార్, సుంకె నిశాంత్, ప్రశాంత్, రాకేష్, ఎల్లయ్య, ఆదిత్య, వసతి గృహం వార్డెన్ సుమలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి రేసులో వేణుగోపాల్ యాదవ్



దరఖాస్తు చేసుకుంటున్న వేణుగోపాల్ యాదవ్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన టీపీ సీసీ అధికార ప్రతినిధి నిజామాబాద్ విభాగం బాస వేణుగోపాల్ యాదవ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో పార్టీ ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకున్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామకాల ప్రక్రియలో భాగంగా అధ్యక్ష పదవి రేసులో ఉన్నానని ఎన్నికల అధికారికి దరఖాస్తు పత్రాన్ని అందజేశానని ఆయన తెలిపారు.

రాకాసిపేట్ చర్చిలో ప్రార్థనలు

బోధన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ చర్చిలో హోళి ట్రినిటి యూత్ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ యువత దేవుని నందు, మనుషుల యందు వర్ధిల్లాలని, చెడు ప్రలోభాలకు వెళ్లకుండా ప్రజలు మంచి మార్గంలో నడవాలని హోళి ట్రినిటి చర్చి పాస్టర్ రెవరెండ్ కే.రెజెన్ సూచించారు. తల్లిదండ్రులను గౌరవించాలని, అందరితో సోదరభావంతో కలిగి ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. యూత్ సండే సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పద్మశాలి వసతి గృహ కార్యవర్గ సభ్యులకు సన్మానం

ఆర్మూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికైన జిల్లా పద్మశాలి విద్యార్థి వసతి గృహ నూతన కార్యవర్గ సభ్యులను ఆర్మూర్ మండలం పిప్రిలో ఆదివారం పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి, విద్యార్థి వసతి గృహ అధ్యక్షుడు దీకొండ యాదగిరి, ఉపాధ్యక్షుడు నూకల విజయ్‌సారథి, ఆర్మూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దాసరి సునీల్ కుమార్‌ను పిప్రి సంఘ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిప్రి సంఘం అధ్యక్షుడు తిరుమల్లేష్, మనోహర్, లింబాద్రి , నూకల శ్రీనివాస్, నూకల గోవర్ధన్ పాల్గొన్నారు.



పిప్రిలో పద్మశాలి వసతి గృహ సభ్యులను సన్మానించిన దృశ్యం

బాన్సువాడ పట్టణ సీఐ అశోక్ బదిలీ



ఎస్పీని కలిసిన బాన్సువాడ నూతన సీఐ తుల శ్రీధర్

బాన్సువాడ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ సీఐగా విధులు నిర్వర్తించిన మండల అశోక్ బదిలీ అయినట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కామారెడ్డి పీసీఆర్‌లో సీఐగా పనిచేసిన తుల శ్రీధర్ బాన్సువాడ పట్టణ సీఐగా బదిలీ చేసినట్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నూతన సీఐ శ్రీధర్ కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్‌చంద్రను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీఐ



బీర్కూర్‌లో సీఐ తిరుపతయ్యకు సెల్యూట్ చేస్తున్న పోలీసులు

బీర్కూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే ఎన్ని కేసులు నమోదయ్యాయి అనే వివరాలను ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. దొంగతనాల నియంత్రణకు పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో గౌరవ మర్యాదలతో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ

బీర్కూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని కమాన్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని 20 మంది వాహనదారులపై జరిమానాలు విధించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై మహేందర్ వాహన దారులకు సూచించారు.

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ

బాన్సువాడ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఉదయం నుంచి భక్తులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ చేపడుతున్న దృశ్యం

మద్దతు ధర కోసం రైతన్న ఎదురుచూపు



రహదారిపై మొక్క జొన్నలను ఆరబెట్టిన రైతన్నలు

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలో ఆరుతడి పంట కింద సాగు చేసిన పంటలలో సోయా, పత్తి తర్వాత మొక్కజొన్న పంటదే సింహభాగం. ఖరీఫ్‌లో ఆరుతడి పంట కింద నియోజక వర్గంలో వందల ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగు చేయగా, ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. వారం రోజుల కిందటి వరకు భారీ వర్షాలు రైతన్నలను అతలాకుతలం చేయగా, ఎండలు కాస్తుండటంతో రైతన్నలు పంట నూర్పిడి పనులలో నిమగ్నమయ్యారు. దీంట్లో భాగంగానే చేతికి వచ్చిన మొక్క జొన్న పంటను నూర్పిడి చేసి రహదారులపై ఆరబెట్టారు. పంట చేతికి వచ్చిన తర్వాత రైతన్నలు పంటను అమ్ముకుందామనుకుంటే మద్దతు ధర లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో మొక్కజొన్న పంటను సాగుచేసిన రైతులకు ఇబ్బంది కలుగకుండా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలుకేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించారు. ఈ సారి పంట చేతికి వచ్చిన ఇంక మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలకు మద్దతు ధర దక్కడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేట్ వ్యాపారులు క్వింటా మొక్క జొన్నలకు నాణ్యతను బట్టి రూ.1800 నుంచి రూ.1950 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నలకు క్వింటా మద్దతు ధర రూ.2400 ప్రకటించిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మద్దతు ధర లేక నిరాశ చెందుతున్నారు. పోని పంటను నిల్వ చేసి అమ్ముకుందామంటే ఆ స్థోమత రైతన్నలకు లేకపోవడంతో కొంతమంది వ్యాపారులు సూచించిన ధరకు పంటను అమ్ముతున్నారు. దీంతో పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదని రైతన్నలు వాపోతున్నారు. అంతేకాకుండా భారీ వర్షాల కారణంగా పంట దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చిందని నిరాశ చెందుతున్నారు. పంట దిగుబడి లేక ఓ పక్క, మద్దతు ధర లేక మరో పక్క తమకు కష్టంగా మారిందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తమకు మద్దతు ధర దక్కాలంటే ప్రభుత్వం తొందరగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

ఎల్లారెడ్డి - నాందేడ్ రహదారిపై వాహనదారుల ఇక్కట్లు

- ఉదయం మట్టితో గుంతలు పూడ్చారు
- మధ్యాహ్నం ఇరుక్కుపోయిన వాహనాలు
- చలనం లేని పాలకులు, రోడ్డు భవనాల శాఖ అధికారులు



రహదారిలో ఇరుక్కుపోయిన వాహనాలను తొలగిస్తున్న పాదాచారులు



మట్టిని తొలగిస్తున్న జేసీబీ

నిజాంసాగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి - నాందేడ్ రహదారి అంటేనే వాహనదారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే నరకం చూడాల్సింది. పాలకులు, రోడ్డు భవనాల శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రహదారి నిజాంసాగర్ మండల కేంద్రం మీదుగా ఎల్లారెడ్డి - కామారెడ్డి వెళుతూ ఉంది. నిజాంసాగర్ మండల కేంద్రం సమీపంలో గల హెచ్‌పి పెట్రోల్ బంక్ నుంచి సుల్తాన్ నగర్ మీదుగా వరకు ఉన్న వరకు ఉన్న రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలమయమై అధ్వానా స్థితికి చేరుకు పోయింది. ఈ రహదారి వెంట వెళ్లే వాహనదారులు ప్రజలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవటం లేదు. ఈ రహదారి వెంటనే వెళ్లాలంటే వాహనదారులు భారీ వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వెళ్లాల్సి వస్తుంది. శనివారం ఉదయం ఈ రహదారి వెంటనే పడ్డ భారీ గుంతల్లో మట్టిని పోసి పూడ్చారు. మధ్యాహ్నం వరకు గుంతల్లో పోసిన మట్టిలో వాహనాలు ఇరుక్కుపోవడంతో వాహనదారులు తిప్పలు పడుతూ వాహనాలను వెలికి తీసుకొని వెళ్లాల్సి వస్తోంది. 45 రోజులుగా ఈ రహదారి వెంటనే పడ్డ భారీ గుంతలను పూడ్చివేయటంలో రోడ్డు భవనాల శాఖ అధికారులు విఫలమయ్యారు. మధ్యాహ్నం కంటి తూర్పు గా మరమ్మతు పనులు చేపట్టారు. ఉదయం పోసిన మట్టిని జెసిబితో తొలగించడంతో రాకపోకలకు ఇబ్బందులు తొలిగిపోయాయి. రోడ్డు భవ నాల శాఖ అధికారులు వెయిట్ మిక్సింగ్ పోసి మరమ్మతులు చేయాల్సిన పనికి తూతూ మంత్రంగా ఒకటి రెండు డీసీఎంలో వెయిట్ మిక్సింగ్ పోసి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. హెచ్పి పెట్రోల్ బంక్ నుంచి బొగ్గు గుడిస వరకు అడుగడుగునా భారీ గుంతలు పడ్డ రోడ్డు భవనాల శాఖ అధికారులు మరమ్మత్తులు చేపట్టడంలో విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి అధ్వాన్న స్థితి చేరిన రహదారిని త్వరితగతిన మరమ్మతులు చేసి రాకపోకలకు ఇలాంటి ఇబ్బందులు కలవకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు పాడైంది.. బస్సు రానంది

▸▸ రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువు ▸▸ బస్సులు రాక ఇక్కట్లు ▸▸ అధికారులు దృష్టిసారించాలని వేడుకోలు

రాజంపేట, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): గత నెల రోజుల నుంచి ఆర్టీసీ బస్సులు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాజంపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆగస్టు నెలలో మండలంలో కురిసిన భారీవర్షాలకు, వచ్చిన వరదలకు చాలాచోట్ల రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ఆర్టీసీ బస్సులు మాత్రం రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి- మెదక్ ప్రధాన రహదారిపై ప్రయాణికులు పెద్దమొ త్తంలో ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు పాడవడంతో పాటు, బస్సు సౌకర్యాలు సైతం తగ్గడంతో మరింత ఇబ్బందిగా మారింది. కళాశాల, పాఠశాల విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు ఎక్కువగా బస్సు ప్రయాణానికే మొగ్గుచూపుతారు. అలాంటిది బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. కొన్నిరోజుల క్రితం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మొరం, కంకర వేసి తాత్కలిక రోడ్లు నిర్మించినా ఉపయోగం లేకుండా పోయింది. కొన్నిచోట్ల వంతెనలు ఉన్నప్పటికీ మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా తయారయ్యాయి. గత మూడురోజుల నుంచి కేవలం గుండారం- కామారెడ్డి బస్సు ఉదయం మాత్రమే నడుస్తుంది. రోడ్డు మరమ్మతులు చేపడితే ఎల్లారెడ్డిపల్లి, గుండారం, సిద్దాపూర్, ఎల్లాపూర్‌తండా, నడిమితండా ప్రజలకు ప్రయాణం సులభం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లతో పాటు, బస్సు సౌకర్యాలను కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


మండలంలో ప్రధానరహదారి దుస్థితి


కుంగిన వంతెన

పాఠశాలల తనిఖీకి ప్రత్యేక బృందాలు

▸▸ ప్రతి త్రైమాసికానికి 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 50 ఉన్నత పాఠశాలల్లో అధికారుల తనిఖీలు
▸▸ పాఠశాలలకు అనుగుణంగా బృందాల ఏర్పాటు, జిల్లాలో 652 ప్రైమరీ స్కూల్స్
▸▸ ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ

కామారెడ్డిటౌన్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన, ఇతర సౌకర్యాల తనిఖీలకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసేందుకు శ్రీకారం చుట్టింది. గత మూడురోజుల కిందట ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సైతం జారీచేసింది. బృందంలో ఎవరెవరు ఉండాలనే దానిపై గైడ్‌లైన్స్‌లో స్పష్టంగా పేర్కొంది. పాఠశాలల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్రవిద్యాశాఖ బృందాలకు సంబంధించిన వివరాలను సైతం వెల్లడించింది. అయితే కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 652 ఉండగా ఈ పాఠశాలల తనిఖీకి 7 బృందాలు, ప్రాథమికోన్నత పాఠశాలలు 123 ఉండగా తనిఖీకి 1 బృందం, ఉన్నత పాఠశాలలు 191 ఉండగా తనిఖీకి 4 బృందాలు ఏర్పాటుచేశారు. ఈ బృందాలు ప్రతి త్రైమాసికానికి 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేయాల్సి ఉంటుంది.

● పాఠశాలలకు అనుగుణంగా బృందాల ఏర్పాటు

జిల్లాలోని ఆయా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అనుగుణంగా బృందాలు ఏర్పాటుచేయనున్నారు. ప్రాథమిక పాఠశాలలోని ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యులు ఉండనుండగా అందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నోడల్ అధికారిగా, ఇద్దరు ఎస్‌జీటీ టీచర్‌లు సభ్యులుగా ఉంటారు. ప్రాథమికోన్నత పాఠశాలలోని బృందంలో సైతం ముగ్గురు సభ్యులు ఉండగా స్కూల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా, ప్రైమరీస్కూల్ హెడ్‌మాస్టర్, ఎస్‌జీటీ సభ్యులుగా ఉంటారు. ఇక ఉన్నత పాఠశాలకు సంబంధించి బృందంలో 9 మంది సభ్యులు ఉండగా గ్రేడ్ -2 గెజిటెడ్ హెడ్‌మాస్టర్ నోడల్ అధికారిగా, 7 గురు ఉపాధ్యాయులు,1 ఫీజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సభ్యులుగా ఉంటారు. అన్ని తనిఖీ బృందాలను జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, డీఈవో కమిటిలు నామినేట్ చేసిన మరోక జిల్లా స్థాయి అధికారిచేత తనిఖీ బృందాలు ఏర్పాటుచేయబడుతాయి.

● వారానికి ఒకసారి డీఈవోకు రిపోర్టు

ప్రతి త్రైమాసికానికి నిర్దేశించిన ప్రకారం పాఠశాలలను తూచాతప్పకుండా తనిఖీ చేసి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనుఅందించేలా ఈ బృందాలు పనిచేయాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తు ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తగిన సలహాలు, సూచనలు అందించాలి. ఆయా పాఠశాలలో తనిఖీలు చేసినప్పుడు గుర్తించిన అంశాలను వారానికి ఒకసారి డీఈవోకు అందించాలి. బృందాలు అందించిన రిపోర్టును విద్యాశాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరిచేలా డీఈవో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బృందంలోని సభ్యులను ఎంపిక చేసేందుకు రాష్ట్రవిద్యాశాఖ సూచించిన అంశాలను కులకుశంగా పరిశీలించి జిల్లాకమిటి ఎంపికచేసిన నామినేట్ అధికారికి జిల్లా విద్యాశాఖ ఆయా సభ్యుల వివరాలు అందించాల్సి ఉంటుంది. అప్పుడు సదరు అధికారి బృందాలను ఏర్పాటుచేసి తగిన విధంగా తనిఖీలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.

తనిఖీ బృందాల ఏర్పాటుకు ఉత్తర్వులు అందాయి

కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యబోధన, ఇతర సౌకర్యాలు తనిఖీ చేసేందుకు రాష్ట్రవిద్యాశాఖ బృందాల ఏర్పాటుకు సంబంధించిన గైడ్‌లైన్స్‌తో ఉత్తర్వులు జారీచేసింది. అందుకు అనుగుణంగా జిల్లాలో బృందాలను ఏర్పాటుచేయనున్నాం. ఈ బృందాలు ప్రతి త్రైమాసికానికి 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేయాల్సి ఉంటుంది. తనిఖీల్లో భాగంగా ఎక్కడైనా లోటుపాట్లు గమనిస్తే తగిన సలహాలు, సూచనలను బృంద సభ్యులు చెబుతారు.

● రాజు, డీఈవో, కామారెడ్డి

15న కురుమ యువ చైతన్యసమితి కమిటీ ఎన్నికలు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కురుమ యువ చైతన్యసమితి నూతన కమిటీ ఎన్నికలను ఈ నెల 15వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాష్ట్రకమిటీ నిర్ణయం మేరకు నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధి విఠల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న కమిటీ సమయం అయిపోయినందున నూతన కమిటీ ఎన్నికలు జరపనున్నట్లు తెలిపారు. కావున జిల్లా కురుమ కులస్థులు, సమితి సభ్యులు, నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల బరిలో బీఎస్పీ

దోమకొండ, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బహుజన సమాజ్‌వాది పార్టీ పోటీలో ఉంటుందని బీఎస్‌పీ కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షుడు నత్తిజీవన్ తెలిపారు. గతంలో బీఎస్‌పీ పార్టీకి ఏనుగు గుర్తు రాలేదని ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడి సింబల్ తీసుకువచ్చారని తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో పోటీచేసి అత్యధిక స్థానాలు గెలుస్తామని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాల్వంచ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని ఇసాయిపేట గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కడెం నారాయణ, ఉపాధ్యక్షుడిగా జగడం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు మల్లయ్య, కోశాధికారిగా ఉప్పు రాములు, సహాయ కార్యదర్శిగా పుప్పాల నర్సింలు, సలహాదారులుగా కడెం రాజు, జగడం నర్సింలు, నూరు బాలరాజు, పుప్పాల బాల్‌రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి పూర్తి సమయాన్ని కేటాయించి అందరిని కలుపుకొని ముందుకు సాగుతామన్నారు.


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ప్రశాంత్

బాన్సువాడ రూరల్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని ఆలయాల అభివృద్ధి కమిటీని ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బసిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మన్నె విఠల్, కార్యదర్శిగా శివరాజులు, కోశాధికారిగా భానుప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ఆలయాల అభివృద్ధి కొరకు గ్రామస్థుల సహకారంతో కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బసిరెడ్డి హన్మంత్‌రెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఇందల్వాయి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చింతలపల్లి చిన్నరాజన్న యూనియన్ బ్యాంక్ కాలనీలో ఉన్న హనుమాన్ ఆలయంలో గ్రానైట్ మార్బుల్ వేయడానికి రూ.55,555లను ఆర్థికసాయాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గోవర్ధన్, జయరాం, భాస్కర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

5వ పేజీ తరువాయి

కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆరోగ్య శ్రీ మిత్రల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులందరికీ జీతాలు ఇవ్వాలని, స్వంతజిల్లాలో నియమించాలని కోరారు. ఞ జిల్లా లోని ఔట్ సోర్సింగ్ ఏ ఎన్ ఏం , ఫార్మసిస్ట్ లను కాంట్రాక్టు పద్ధతిలో మార్చాలని కోరారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో 8 మంది డిఈఓ లను తొలగించడం అన్యాయం అన్నారు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేస్తామన్నారు. వచ్చే నెల నవంబర్ 9 న రాష్ట్ర మహాసభ సంగారెడ్డిలో ఉంటుందని ఉద్యోగులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు చంద్రశేఖర్, కొల్లాపురం బాబు, జోత్స్న,సావిత్రి,అల్లాఉద్దీన్ ,స్వామి ,గంగాధర్,అన్నపూర్ణ, కవిత, సుజాత, కళ్యాణి, అమీనుద్దీన్, వీరేష్, ప్రభాకర్, దేవలక్ష్మి వాణి, సుశీల, శోభ, సంగీత, మాధవి, రాజమణి, రాధిక, సునీత, బాలమణి, ప్రవీణ, శ్రీలత, ఇమ్రాన్, రాథోడ్ నాయక్ ,శ్రీనివాస్, మల్లికార్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక, వడ్డీలు కట్టలేక

5వ పేజీ తరువాయి

గ్రామ సర్పంచ్‌లు అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ మీద వడ్డీలు పెరిగిపోతున్నాయని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రెండేళ్లుగా పెండింగ్‌లోనే బిల్లులు..

గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మాజీ సర్పంచ్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు కాకపోయినప్పటికీ బయట నుంచి అప్పులు తీసుకువచ్చి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా పల్లె ప్రకృతి వనాల నిర్మాణ పనులు, వీధి దీపాలు, శానిటేషన్, మంచినీటి బావి మోటార్ల మరమ్మతులు, నర్సరీల నిర్వహణ, మోటార్ల, స్టార్టర్ల కొనుగోలు, అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల కొనుగోలు, స్మశాన వాటిక, డంపింగ్ యార్డు నిర్మాణ పనులు, ట్రాక్టర్ ఈఎంఐ, డీజీల్ మెయింటెనెన్స్ ఖర్చులతో పాటు సీసీ రోడ్ల నిర్మాణలు, సైడ్ కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల క్రితం మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బకాయిల వివరాలను ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదిక తీసుకుంది.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

ఇందూరు,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు వెల్నెస్ ఆసుపత్రి, ఇందూర్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆది వారం జిల్లాకేంద్రంలోని పులాంగ్ చౌరస్తా నుం చి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వెల్నె స్ ఆసుపత్రి ఎండీ సుమన్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, యుబి హోటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు, మెడికల్ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన తీసుకురా వడానికి సామాజిక బాధ్యతతో ర్యాలీ నిర్వహిం చామన్నారు. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే అరికట్టవచ్చని పేర్కొన్నారు. అలాగే వెల్నెస్ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఆసుపత్రి యాజమాన్యం తరఫున రూ.50 వేల విలువ గల ఫ్యామిలీ హెల్త్‌కారును అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ అన్ని స్థానాల్లో గెలుపొందాలి: మంత్రి వివేక్

మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఆర్మూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ మోర్తాడ్‌లోని తన నివాసానికి ఆహ్వానించి సమావేశమయ్యారు. జిల్లా పర్యటనలో భాగంగా వివేక్ వెంకటస్వామిని తన నివాసం వద్ద కలిసి తీసుకెళ్లారు. ఆయనను శాలువతో సన్మానించి పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని సీట్లను గెలుపొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుంకెట రవి, వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● కమ్మర్‌పల్లి శివారులోని ప్రజానిలయానికి మంత్రి వివేక్ వెంకట స్వామి ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకుడు సుంకెట రవి, నాయకులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

● ఉస్మానియ యూనివర్సిటీ జాక్ అధ్యక్షుడు అంగిరి ప్రదీప్ తల్లి అంగిరి లక్ష్మీ ఇటీవల మరణించింది. కాగా నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి వివేక్ వెంకట్ స్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఈ విషయం తెలుసుకొని ఆదివారం అంగిరి ప్రదీప్ స్వగృహం ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌కు వెళ్లి ప్రదీప్‌ను పరామర్శించారు. అంగిరి లక్ష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు గడుగు గంగాధర్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి వివేక్ వెంకటస్వామిని శాలువాతో సన్మానిస్తున్న సునీల్‌కుమార్


మధుసూదన్‌ను అభినందిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

బాగా చదివి మంచిపేరు తీసుకురావాలి

▸▸ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కెంపుల మహేశ్వరీ- రమేష్ కుమారుడు మధుసూదన్ మాస్టర్ ఆఫ్ డిగ్రీ చేసేందుకు ఆస్ట్రేలియా వెళ్తున్న నేపథ్యంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాగా చదివి జిల్లాకు, మండలానికి, గ్రామానికి మంచి పేరును తీసుకురావాలన్నారు. అనంతరం మధును సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, చంద్రం, రవీందర్, రాజు, విఠల్, కమలాకర్ రావు, భూమయ్య, స్వామి, రాజయ్య, కుంటయ్య, కామారెడ్డి శిశురక్ష ఆసుపత్రి ఎండీ విజయానంద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గాడితప్పిన ఐసీడీఎస్

5వ పేజీ తరువాయి

షాడో డీడబ్ల్యుఓలు మాత్రం తన విభాగం పనులు విస్మరించి సమయం కాని సమయంలో సదరు విభాగాలకు ఎంట్రీలు ఇస్తు స్వంత వ్యాపకాలలో నిమగ్నమవుతున్నారు. ఇతరులకు ఆ శాఖలోకి వెళ్లాలంటే సవాలక్ష నిబంధనలు చెప్పె ఉన్నతాధికారులు మాత్రం సొంత శాఖలో సిబ్బంది నిబంధనలు తుంగలో తొక్కితే ఎందుకు మౌనంగా ఉంటున్నారనేది ప్రశ్నర్థకంగా మారింది. ఇవేకాక అర్హతలు లేని వారిని అందలం ఎక్కించే ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. గతంలో ఓ ఎన్‌జీవోలో పనిచేసిన వ్యక్తి కుటుంబ సభ్యుడికి ఓ సేవావిభాగాన్ని అప్పగించడానికి అస్త్రశస్త్రలు ఉపయోగించి చివరకు అనుకున్న వ్యక్తిగా ఆ విభాగం వచ్చేలా చేశాడనేది ఆశాఖలో పనిచేసే సిబ్బందే కోడై కూయడం కోసమెరుపు. శాఖలో ప్రతి విభాగానికి తనకు అనుకూలంగా వున్న వారిని పెట్టి కేవలం డబ్బులను దండుకునే ప్రయత్నాలు చేస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. జిల్లా ఉన్నతాధికారి కంటే ఎక్కువగా సదరు అధికారి ఆశీస్సులు ఉంటే ఏ పనైన సులభంగా అవుతుందనే ఆలోచనలకు ఆయా విభాగా లకు చెందిన వారు ఉన్నారంటే ఏ స్థాయిలో ఉద్యోగి పనితీరు ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో ప్రత్యేక దృష్టిసా రించి శాఖలో షాడో డీడబ్ల్యుఓల పనితీరు పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఐఎఫ్‌టీయూ కమిటీ ఎన్నిక

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): ఐఎఫ్‌టీయూ నిజామాబాద్ నగర 7వ మహాసభలో నూతన నగర కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నగర కార్యదర్శి శివకుమార్ తెలిపారు. నగర కమిటీ అధ్యక్షుడిగా మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా మోహన్, రాయిస్, సహాయ కార్యదర్శిగా నర్సింగ్‌రావు, కోశాధికారి రాజు, 20 మందిని కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కాగా నూతన కమిటీ సభ్యులు మహాసభలో పలు తీర్మానాలు చేశారు.

సమస్యల వలయంలో భూంపల్లి ఉన్నత పాఠశాల

▸▸ ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు ▸▸ చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నామని ఆవేదన ▸▸ మౌలిక వసతులు కల్పించాలి

సదాశివనగర్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూంపల్లి ఉన్నత పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. పాఠశాలకు ప్రహరీ లేక పందులు, పశువులు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. దీంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. గతంలో ప్రహరీ నిర్మాణపనులు చేపట్టినా అసంపూర్తిగా వదిలేయడంలో అది కాస్త కూలిపోయి పాఠశాలకు రక్షణ లేకుండా పోయింది. విద్యార్థులకు శరీర దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం ఆట స్థలం కూడా లేకపోవడం దురదృష్టకరం. గతంలో నిర్మించి వదిలేసిన నీటికుండీల్లో చెత్తచెదారం పేరుకుపోయి దోమలకు నిలయాలుగా మారాయి. వెరసి ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే సమయంలో ఏకాగ్రత కోల్పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతంలో సైతం చెత్తచెదారం చేరి దుర్వాసన వస్తుందని, మూత్రవిసర్జనకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి వాటిని పరిష్కరించి మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వమే కాకుండా గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఆర్థిక వనరులు సమకూర్చి పాఠశాలను అభివృద్ధి చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి.

గ్రామస్థులు సహకారం అందించాలి



గ్రామస్థులు ఐకమత్యంతో పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలి. పాఠశాలను అభివృద్ధి చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం సైతం సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలి. ప్రహరీ, మైదానం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- లోకేశ్వర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం.


కూలిపోయిన పాఠశాల ప్రహరీ

రెడ్డి సంఘ ఆత్మీయ సమ్మేళనం

భిక్కనూరు, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఆదివారం ఏనుగు రెడ్డి సంఘ సభ్యులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామదేవతలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాజుల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి వదిన, మరదళ్లు గాజులు వేసుకొని ఆశీర్వదించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం నిర్వహించిన యువతీయువకుల, చిన్నారుల సాంస్కృతి కార్యక్రమాలు, కబడ్డీ ఆటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సమ్మేళన కార్యక్రమంలో కలిసిన సంఘ సభ్యులు

వేచి ఉండాలంటే.. ముక్కు మూయాల్సిందే

మహమ్మద్‌నగర్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలకేంద్రంలోని ప్రధానరహదారి పక్కన గల మురికికాలువలు దుర్వాసతో కంపు కొడుతున్నాయి. దీనికి తోడు రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలకెత్తి వనంలా కన్పించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే ఉన్న యూనియన్ బ్యాంకు, మెడికల్ షాపులు, మీసేవా కేంద్రం, ఉండటంతో పాటుగా ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సుల కోసం ఇక్కడే వేచి ఉంటారు. అయితే ఇక్కడ వేచి ఉండాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అంతేకాకుండా తీవ్ర దోమల బెడదతో ప్రయాణీకులు, బ్యాంకులకు వచ్చే వారు, స్థానికులు ఇక్కట్లు తప్పట్లేదు. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు సైతం మధ్యలోనే నిలిచిపోవడంతో దుమ్ము, ధూళీతో వాహనదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై స్థానిక కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇకనైనా మండల అధికారులు ఈ సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని కోరుతున్నారు.


ప్రధానరహదారి పక్కనే అధ్వానంగా ఉన్న మురికికాలువలు

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కానిస్టేబుల్
ప్రియ 35- కాంతార
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి ఓజీ
వెంకటేశ్వర కాంతారా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.150
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230